గ్రామస్థాయి నుంచి అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - అనపర్తి : గ్రామస్థాయి నుంచి అభివృద్ధి జరగాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్లో నూతనంగా నిర్మించిన జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్ రామ్, బి ఆర్ అంబేద్కర్, డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి షాపింగ్ కాంప్లెక్సు ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయిల్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీ భూమి ఇస్రాయిల్ మాట్లాడుతూ సీఎం జగన్ నిరుపేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, పంచాయతీ ఈవో మల్లిడి విజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి (ఎస్ ఎస్), సాయి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

తాళ్లూరులో బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో గండేపల్లి మండలం, తాళ్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లూరు గ్రామస్తులు మహాశక్తి కమిటీ బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ సంక్షేమ పథకాలకు, తెలుగుదేశం పార్టీకి తాళ్లూరు గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మహాశక్తి మహిళల కమిటీ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి భవిష్యత్తు గ్యారెంటీ పథకాలు వివరిస్తూ చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపికి ప్రజల మద్దతు కోరుతూ గ్రామమంతా పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు , మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, క్లస్టర్ ఇంచార్జి బొల్లం రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - అయినవిల్లి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గురువారం సిరిపల్లి బిసి కమ్యూనిటీ హాల్లో మండల వైసీపీ కన్వీనర్ కుడుపూడి విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాస్, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, వాలంటీర్లు, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - సామర్లకోట : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నిమ్మకాయల చినరాజప్ప కుమారుడు నిమ్మకాయల రంగనాగ్ హాజరయ్యారు. టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసారని, జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాలకుర్తి శీను బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తోటకూర శీను, చల్ల బుజ్జి, యూత్ సభ్యులు భారీగా పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనాలు

విశాలాంధ్ర - కరప : కరపలో గురువారం గణపతి నిమజ్జనాలు పోలీసులు బందోబస్తు మధ్య ఘనంగా చేపట్టారు. కరపలో వీధికో వినాయకుడిని నిలబెట్టడంతో భారీ సంఖ్యలో విగ్రహాలు ఉన్నాయి. వీటిని బుధవారం నుండి పోలీసులు ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా, ఎస్సై నౌదు రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిమజ్జనాలు చేయించారు. కరపలో వినాయకుడి ఊరేగింపు ఉత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డు గుండా విగ్రహాలన్నీ లైన్‌గా సుమారు ఒక కిలోమీటర్ దూరం పైనే ఊరేగింపు ఉండడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది, డిజిటల్ సౌండ్ సిస్టంతో యూత్ ఉర్రూతలుగారు. నేటితో చాలావరకు నిమజ్జనాలు పూర్తయ్యాయని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కరప మండలంలో వినాయకుడి నిమజ్జనాలు పూర్తయినయని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్ కాజల్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు ఎస్ఈబి స్టేషన్ పరిధిలో గల ఏలేశ్వరం మండలంలో ఏలేరు ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో విస్తృతంగా దాడులు చేసి సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఈబి సీఐ పి అశోక్ తెలిపారు. ఏలేశ్వరం చెందిన గెద్దాడ బాలరాజు అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం పేరవరం గ్రామంలో పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా నాటు సారాయి మరియు గంజాయి నిర్మూలనపై ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఎస్ఈబి ఎస్సై బి. శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్స్ వెంకన్న దొర, కృష్ణార్జున, కానిస్టేబుల్స్ ఆర్. దొరబాబు, ఎం.వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు అక్రమం

విశాలాంధ్ర-దేవరపల్లి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుపై వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బివి రామ్ తెలిపారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో సీనియర్ తెలుగుదేశం నేత కంటిపూడి సుబ్బారావు స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ కక్షతో ఏవిధమైన సాక్షా ధారాలు లేకుండా చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని అన్నారు. 16 నెలలు జైలులో ఉన్న జగన్మోహన్ రెడ్డి నారా చంద్రబాబు నాయుడును కూడ జైల్లో పెట్టాలని ఆకాంక్షతో అక్రమంగా అరెస్టు చేయించారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిపక్ష నేతను గవర్నర్ అనుమతి లేకుండా అరెస్టు చేయటం విడ్డూరంగా ఉందని అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచిన ఘనత నారా చంద్రబాబు నాయుడుదేనని అన్నారు.

నడకతో గుండె పదిలం

అపోలో 3కె వాక్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రతీరోజూ నడక మరియు వ్యాయామంతో గుండెను కాపాడుకోవచ్చని కాకినాడ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యస్. సతీష్ కుమార్ అన్నారు. సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కాకినాడ అపోలో హాస్పిటల్స్ వారు నిర్వహించిన 3 కె వాక్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అపోలో హాస్పిటల్ వారి 3 కె వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అపోలో హాస్పిటల్ నుండి ప్రారంభమైన 3 కె వాక్ రాఘవేంద్రస్వామి గుడి, సినిమారోడ్, వైయస్ఆర్ బ్రిడ్జి, కోకిల సెంటర్, జన్మభూమి పార్క్ మీదుగా భానుగుడి సెంటర్ వద్ద ముగిసింది. భానుగుడి సెంటర్లో అపోలో హాస్పిటల్స్ యూనిట్ సిఇఓఐవి రమణ మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని, గుండెను పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ముందు ఎవరి గుండె గురించి వారు తెలుసుకోవలసిన బాధ్యత వారికి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం సుమారుగా ఒక కోటి డభ్భై లక్షల మంది చనిపోతున్నారని అందులో 30 శాతం మంది గుండె సంబంధిత వ్యాధులతో చనిపోతున్నారని అపోలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ టి. వెంకటేశ్వరరావు చెప్పారు. వారంలో కనీసం 5 రోజులు 30 నిమిషాలు నడిస్తే చాలా మంచిదని, మంచి జీవన విధానం, సరియైన నిద్ర గుండెకు ఆరోగ్యదాయకమని తెలిపారు. గుండె వ్యాధుల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ నాన్ కమ్యూనకబుల్ (యన్‌సిడి) డిసీజెస్ వలన కూడా గుండె వ్యాధుల సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయని, కనుక ప్రతీ 6 నెలలకు ఒకసారి బేసిక్ కార్డియాక్ హెల్త్ చేయించుకోవడం ద్వారా ముందుగానే గుండె వ్యాధులు నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు.

డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ముందు గుండె గురించి తెలుసుకోవాలని, ఫ్రెష్ ఫ్రూట్స్, వెజిటబుల్స్ ఎక్కువగా ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలని ప్రతీ రోజూ ఎక్సర్సైజ్ అలవాటు చేసుకోవాలని అన్నారు. అపోలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పిపి చటర్జీ మాట్లాడుతూ తల్లిదండ్రులకు డయాబెటిస్, బిపి ఉంటే పిల్లలు కూడా గుండెను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ ర్యాలీలో అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ యస్ శ్రీనివాస్, డియస్ పి మురళీకృష్ణారెడ్డి, అపోలో హాస్పిటల్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా జేసన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జివిఆర్ మూర్తి, మార్కెటింగ్ ఇన్‌చార్జి అంజిబాబు, హాస్పిటల్ సిబ్బంది, కైట్ కాలేజీ మేనేజర్ రమేష్ కాంత్, కైట్, పైడా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా

కొవ్వొత్తులు, కాగడాలతో ప్రదర్శన

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక రాజా ట్యాంకు, వివేకానంద పార్కులో బాబుతో నేను ప్లే కార్డ్స్ కొవ్వొత్తులు, కాగడాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. చంద్ర బాబుకు జరిగిన అన్యాయానికి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా స్వచ్ఛందంగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ సుంకర పావని తిరుమల కుమార్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్‌లో అవినీతి జరిగిందనేది వైసీపీ అసత్య ప్రచారం మాత్రమేనన్నారు. ఏపీతోపాటు తెలంగాణ గుజరాత్‌లతో సహా మొత్తం 8 రాష్ట్రాల ప్రభుత్వాలతో సిమెన్స్ ఒప్పందం కుదుర్చుకుందని, స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టును తీసుకొచ్చి, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి 2 లక్షల 13 వేల మంది యువతకు శిక్షణ ఇచ్చినట్లు స్వయంగా హైకోర్టే చెప్పిందని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే సిఐడి అధికారులు మాత్రం జగన్ రెడ్డి చెప్పినట్టు విని చట్టాల్ని ధిక్కరించి వ్యవస్థల్ని మంట కలుపుతున్నారని సుంకర పావని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సిహెచ్ పార్వతి, కోన వెంకట లక్ష్మి, గండేపల్లి శ్రీదేవి, చింతల సత్యకుమారి, నక్క లక్ష్మి, కొలుసు పావని, సిహెచ్ భవాని, గంగాపార్వతి, పోలవరపు లక్ష్మి, తోట మంగ, అడపా జ్యోతి, దొడం లక్ష్మి, చామ అప్పాయమ్మ, పోలవరపు నూక రత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు గ్రీన్ సిగ్నల్

విశాలాంధ్ర - అమలాపురం : ఎన్నో ఏళ్లుగా కుల గణన జరగాలని తాము కోరుతున్నాం. ఇప్పటి వరకు పాలకులు పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ విషయంలో ముందుకు వచ్చి జీఓ ఇచ్చారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణరావు అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గణన త్వరలో ప్రారంభం అవుతుందని, బిసి కులాలను జాగృతం చేస్తూ పలు సమావేశాలు నిర్వహిస్తామని కుడుపూడి అన్నారు. 77 ఏళ్ల స్వతంత్ర చరిత్రలో కుల గణన పై ఎవరు వత్తిడి తేలేదన్నారు. బీహార్‌లో నితీష్, ములయం, లల్లూప్రసాద్ యాదవ్, కరుణానిధి తదితరులు వేసిన ఈ బీజాన్ని మన రాష్ట్రం లో జగన్మోహన్ రెడ్డి వేసారన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోయినా దాన్ని సమూలంగా మార్చటానికి కులస్తులు కృషిచేసేలా తాను ప్రయత్నం చేస్తానని సూర్య నారాయణ రావు అన్నారు. తన చివరి శ్వాస వరకు బిసిల అభ్యున్నతికి పోరాటం చేస్తానని కుడుపూడి స్పష్టంచేశారు. పాత్రికేయులు సమావేశంలో మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, దండుమెను రూపేష్, గుత్తుల ధర్మా రావు, కడలి దుర్గ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్ళపై నిలబడి టీడీపీ నేతల నిరసన

విశాలాంధ్ర - రావులపాలెం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ? శుక్రవారం రావులపాలెంలో టీడీపీ నాయకులు అంబేద్కర్ మహాశయా ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగాన్ని కాపాడూ అంటూ మోకాళ్ళపై నిలబడి నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ? టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో రావులపాలెం టీడీపీ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సత్యానందరావు న్యాయవాదులతో కలిసి భారత రాజ్యాంగం పుస్తకాలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మోకాళ్ళపై కూర్చుని రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చెయ్యాలంటూ నినాదాలు చేసారు. అనంతరం న్యాయవాదులు, క్లస్టర్ 4 నాయకులు దీక్షల్లో పాల్గొన్నారు.

ఘనంగా దివాకర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర రెవిన్యూ జెఏసి చైర్మన్ కోనసీమ జేఏసి చైర్మన్ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కో చైర్మన్ వీఎస్ దివాకర్ పుట్టినరోజు వేడుకలు గురువారం అమలాపురంలోని ఆయన స్వగృహంలో అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు దివాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా రెవిన్యూ సంఘాలు వైఎస్ఆర్‌సిపి, తెలుగుదేశం, సీపీఐ, సీపీఎం నాయకులు, విఆర్ఓల జిల్లా అసోసియేషన్, సర్వేయర్ల అసోసియేషన్ పంచాయతీరాజ్ అసోసియేషన్ నాయకులు, జిల్లా నాయకులు, ఆర్డిఓ సిసి వెంకట్, బీసీ, ఎస్సీ సంఘాలు, వివిధ ఉద్యోగ సంఘాలు, తరలి వచ్చి దివాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విఆర్ఓ సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల ఏలేశ్వరరావు, ఆరవ పూర్ణచంద్రరావు, తిక్కిరెడ్డి నేతాజీ, మోకా వెంకట సుబ్బారావు, అధికారి సత్యనారాయణ, అడపా సుబ్రహ్మణ్యం, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర - మామిడికుదురు : గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా పెదపట్నం శ్రీ బాల గణపతి యూత్ అధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామివారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం పెదపట్నం గ్రామంలోని వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జన మహోత్సవం సందర్భంగా బాల గణపతి యూత్ అధ్వర్యంలో అంగరంగ వైభవంగా గణేశుని శోభాయాత్ర నిర్వహించారు.

స్కిల్ అక్రమాలపై కమిటీ వేసి నిరూపించాలి

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : మాజీ సీఎం చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా అక్రమాలకు పాల్పడ్డాడని తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులు దీనిపై అసెంబ్లీలో అఖిలపక్ష కమిటీ ఎందుకు వేయలేదని మాజీమంత్రి చిక్కాల రామచంద్రరావు ప్రశ్నించారు. గురువారం చిక్కాల జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్కి సంబంధించి 2021 డిసెంబర్లో అక్రమాలు చేశాడంటూ కేసు నమోదు చేశారని అప్పటినుంచి విచారణ ప్రారంభించకుండా సుమారు 20 రోజుల క్రితం కావాలనే రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సిఐడి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు గనుక అక్రమాలకు పాల్పడితే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం ఎందుకు అఖిల పక్ష కమిటీ వేయలేదో చెప్పాలన్నారు. చంద్రబాబు అక్రమాలకు పాల్పడలేదని అందువల్ల అసెంబ్లీ అఖిలపక్షం కమిటీ వేయలేదని చిక్కాల చెప్పారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో ఆరు క్లస్టర్లలో 72 కేంద్రాల ద్వారా రెండు లక్షల 13 మంది శిక్షణ పొందారని 70 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మద్దతుగా నిలిచిన జనసేన, వామపక్ష ఇతర రాజకీయ పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టీడిపి నాయకులు దేవు వెంకన్న, రామదేవు సీతయ్య దొర, వాసిరెడ్డి చిట్టిబాబు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యం, చిక్కాల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి రోడ్డుపై అడుగుకో గుంత, గజానికో గొయ్యి

విశాలాంధ్ర - గోపాలపురం : గోపాలపురం నుండి దొండపూడి వరకు సుమారు 15 కిలో మీటర్ల దూరం ఉందని, మండల కేంద్రానికి సుమారు 15 గ్రామాల ప్రజలు అనేక పనుల నిమిత్తం రావాల్సి ఉండగా తరచూ ప్రమాదాల ప్రమాదాల బారిన పడుతున్నామని, వాహన చోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ ఆధ్వర్యంలో, గుత్తేదారులు కాసులకు కక్కుర్తి పడి నాణ్యతా ప్రమాణాలను విడిచిపెట్టి తూతూ మంత్రంగా తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టడంతో (ప్యాచ్ వర్క్) నాలుగుసార్లు మరమ్మతులు చేపట్టినప్పటికీ, మరమ్మత్తులు చేపట్టిన 20 రోజులకే పాడైపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినప్పటికీ బూడిదలో పోసిన పన్నీరు గానే మిగిలి పోతున్నాయని అన్నారు. గుడ్డుగూడెం, నుండి కొవ్వూరుపాడు వరకు పెద్ద పెద్ద గోతులమయం, సాగిపాడు ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ వద్ద పెద్దపెద్ద గోతుల్లో నీరు చేరడంతో విద్యార్థులు ప్రయాణికులు వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారిందని, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు మరమ్మత్తులు చేపట్టినప్పుడు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రభుత్వ యంత్రాంగం ప్రజాప్రతినిధులు రానున్న ఎన్నికలలోపే రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జక్కంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీతానగరం: జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహణ గత కొద్ది కాలంగా నిర్విరామంగా ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పర్యవేక్షణలో జరుగుతోంది. దీనిలో భాగంగా గురువారం మండలంలో వెదుళ్లపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. సుమారు 750 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీతో పాటు శస్త్ర చికిత్సలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని అనుభవించాలనే ఆకాంక్షతో స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సహకారంతో వివిధ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాలలో చాలా మందికి వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలియని పరిస్థితి ఉందని,అటువంటి వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తూ గ్రామంలో ప్రతి నిరుపేద కుటుంబాలకు వైద్యం అందించాలనే లక్ష్యంతో జక్కంపూడి రామ్మోహన రావు ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న,మండల కో కన్వీనర్ కరుటూరి హరిబాబు ,ఇనగంటివారిపేట గ్రామ సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ సత్యం మదనమోహన్, కవల దుర్గం, ఆకుల అబ్బున్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ కాపురస్తుడను అయిన నాకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో సర్వే నెం:52/1 లో చ.గు॥ 150లు ఖాళీ నివేశన స్థలము కలదు. సదరు స్థలము నాకు **ది. 12-02-2007**వ తేదీన ప్రత్తిపాడు సబ్ రిజిష్టార్ కార్యాలయంలో రిజిష్టరు కాబడిన **నెం 303/2007** గల క్రయ దస్తావేజు రీత్యా నాకు దఖలుపడినది. **సదరు నెం: 303/2007 క్రయ దస్తావేజు నేను ది.21-07-2023**వ తేదీన ధర్మవరం గ్రామం నుండి ప్రత్తిపాడు ప్రయాణిస్తున్నప్పుడు మార్గ మధ్యంలో ఎక్కడో పడిపోయినది. కావున సదరు డాక్యుమెంటు పడిపోయినది. కావున ఎవరికైయినా సదరు డాక్యుమెంటు దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందించి తగిన బహుమతి పొందగలరు.

దాడి పుత్రరావు, (తండ్రి) వెంకట్రావు
డోరు నెం 2-37/1, ధర్మవరంగ్రామం
ప్రత్తిపాడు మండలం, కాకినాడ
జిల్లా-533430
ఫోన్ నెం 8179121426

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

యథేచ్ఛగా పోలవరం గట్ల మట్టి తరలింపు

విశాలాంధ్ర - జగ్గంపేట : యథేచ్ఛగా పోలవరం కాలువ గట్ల మట్టిని తరలించి పచ్చని పంట పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నింపుతున్నారు. జగ్గంపేట మండలం రామవరం నుండి మల్లిసాక రోడ్డులోని పోలవరం కాలువ మట్టిని యథేచ్ఛగా జెసిబి, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పోలవరం అధికారులకు ముడుపులు అందడంతో పట్ట పగలే తరలిస్తున్నా అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆ మట్టిని తరలిస్తున్న మల్లిసాకలోని 161 సర్వే నెంబర్ పంట భూమికి అనుమతి లేదు. పంట భూమిని వేరే వాటికి మార్చాలంటే తప్పని సరిగా రెవిన్యూ అనుమతులు తీసుకుని, ప్రభుత్వానికి ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అవేమీ చెల్లించకుండానే, ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే మట్టిని నింపుతున్నారు. దీనిపై తహశీల్దారు శ్రీదేవిని వివరణ కోరగా తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, వారికి నోటీసులు ఇస్తామన్నారు.

భువనేశ్వరికి 'సత్యమేవ జయతే' బహూకరణ

విశాలాంధ్ర - సీతానగరం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ పరిశీలకులు ధూళిపూడి వెంకటరమణ మహాత్మా గాంధీ చరిత్రకు సంబంధించిన సత్యమేవ జయతే పుస్తకం, మురమళ్ళ శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ధూళిపూడి వెంకటరమణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును అన్యాయంగా పొంతనలేని కేసులు పెట్టారని అన్నారు. గత 18 రోజులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉంచిన నాటినుంచి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలు లో "బాబు తో నేను" అంటూ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు అవుతూ తమ మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

టీడీపీ నిరాహారదీక్ష

విశాలాంధ్ర - అనపర్తి : 1978 లో ఏవిధంగా ఇందిరాగాంధీ ఓడిపోయిందో అదే పరిస్థితి నేడు పులివెందులలో వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాబోతుందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జోస్యం చెప్పారు. గురువారం స్థానిక ఎర్ర కాలువ వంతెన పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నియోజకవర్గ ఎస్సి సెల్ ఆధ్వర్యంలో బాబుతో నేను లో భాగంగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి తన నెత్తిని కొరివితో తానే గోక్కుంటున్నాడని వైసీపీ పార్టీకి భస్మాసురుడిగా ఆ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మారారని త్వరలోనే బంగాళా ఖాతంలో జగన్ కలిసి పోతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు కేఎస్ జవహర్, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆనందప్రసాద్‌కు పీహెచ్‌డీ

విశాలాంధ్ర-దేవరపల్లి : విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ నుండి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ కోర్సులో పిహెచ్.డి పొందినట్లు డి ఆనంద ప్రసాద్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను పిహెచ్.డి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ జాలాది రవి గైడెన్స్ మేరకు నాలుగు సంవత్సరాల్లో పిహెచ్.డి పూర్తి చేసినట్లు తెలిపారు తాను బీటెక్ ఎంబీఏ పూర్తి చేశానని, ఏపీ సెట్‌లో కూడా ఉత్తీర్ణత పొందానని తెలిపారు. పీహెచ్డీలో మార్కెటింగ్ సబ్జెక్టులో ఎం ఎఫ్ సి జి యొక్క వినియోగదారుల ప్రవర్తన వివిధ అంశాలపై పరిశోధన చేసినట్లు ఆనందప్రసాద్ తెలిపారు. మార్కెటింగ్ లో రెండు అంశాలపై ఆర్టికల్స్ రాసినట్లు తెలిపారు నాలుగు సంవత్సరాలు ఎంతో కృషి చేసి ఆంధ్ర యూనివర్సిటీ నుండి పిహెచ్.డి పొందటం తన అదృష్టమని అన్నారు. తనకు శిక్షణ ఇచ్చిన ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ జాలాది రవి తన తల్లిదండ్రులైన డి సువర్ణ రాజు మేరీ కమల స్పందనకి కృతజ్ఞతలు తెలిపారు. తాను వినియోగదారుల యొక్క మనస్తత్వం తెలుసుకొని తన ధనుగుణంగా కామర్స్ అండ్ మేనేజ్మెంట్ లో సహకారం అందిస్తానని అన్నారు.

ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండల కేంద్రం, ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనానికి గురువారం నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ స్థలం వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఉదయం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సాయంత్రం వేలివెన్నులో, అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన వినాయక చవితి ఊరేగింపులో రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ తో కలిపి పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, జెడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, జె సి ఎస్ సచివాలయ కన్వీనర్, సర్పంచ్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

తాడిపర్రు పీఏసీఎస్ నికర లాభం రూ.10 లక్షలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: తాడిపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వంద శాతం రుణాలు వసూలు చేసినట్లు సంఘ చైర్మన్ అక్కిన రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన అధ్యక్షతన సొసైటీ భవనంలో నిర్వహించిన మహాజన సభ లో మాట్లాడారు. 2022- 2023 సంవత్సరానికి ఆడిట్ రిపోర్ట్ ప్రకారం స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు 10 కోట్లు, 2 కోట్లు రూపాయలు ఎరువులు, వ్యాపారం నిర్వహించగా 9లక్షల 77 వేల రూపాయలు నికర లాభం గా ఉన్నట్లు తెలిపారు. వంద శాతం రుణాలు వసూలు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, తాడిపర్రు, వెలగదుర్రు గ్రామ రైతులు, సీఈవో కరుటూరి సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-భీమడోలు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఏలూరు ఆర్డీవో ఖాజావలి అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమంపై భీమడోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏలూరు ఆర్డీవో ఖాజావలి మండల వైద్యాధికారులు, రెవెన్యూ, సచివాలయాలు, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో ఖాజావలి కార్యక్రమం నిర్వహణపై అధికారులు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహసీల్దార్ ఇందిరాగాంధీ, ఎంపీడీవో సిహెచ్ పద్మావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, వైద్యాధికారులు డాక్టర్ లీలాప్రసాద్,డాక్టర్ లక్ష్మీ,డాక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపాలెం సొసైటీ లాభం రూ. 37 లక్షలు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : నవాబు పాలెం సొసైటీ ఆదాయం ఈ సంవత్సరంలో 37 లక్షల 64వేలు వచ్చిందని సొసైటీ చైర్ పర్సన్ జద్దు హరిబాబు తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలోని సొసైటీ బ్యాంకు ఆవరణలో సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ లావాదేవీలు ఖర్చులను సొసైటీ కార్యదర్శి పి.సత్యనారాయణ వివరించారు. సొసైటీ ఆదాయంలో సభ్యులకు ఎనిమిది శాతం డివిడెంట్ అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ హరిబాబు మాట్లాడుతూ సొసైటీ బ్యాంక్ ద్వారా రైతులకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు, ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం రైతులకు రుణాల అందించి వారు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మద్దుకూరి ప్రసాద్, చిట్టూరి బాపన్న, రైతులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: రవాణా రంగంలో పనిచేస్తున్న లక్షలాదిమంది కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి. ఎన్ వి డి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురు వారం కలిదిండిలో రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న జీపు యాత్ర ప్రచార యాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగం ద్వారా లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని సంపాదిస్తూ దానికి ప్రధాన కారణమైన రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు ఇతర కార్మికుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు క్లీనర్లు చిన్న యజమానులు రవాణా రంగం మీద ఆధారపడ్డ ప్రతి కార్మికుడు చలో రాజభవన్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జె. గోపి సిఐటియు నాయకులు జక్కుల. మహేష్, శ్రీకాంత్, ప్రకాష్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు జి. రవీంద్ర, బి. శ్రీనివాసరావు, దాసు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో టిడిపి భిక్షాటన

విశాలాంధ్ర -భీమవరం: చంద్రబాబుపై అక్రమ కేసులకు వ్యతిరేకంగా భీమవరంలో గురు వారం టిడిపి శ్రేణులు రిలే నిరాహారదీక్షలు చేపట్టి బిక్షాటన నిర్వహించి నిరసన తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో రేవు వెంకన్న, వీరవల్లి శ్రీనివాస్, గూడూరి సుబ్బారావు, మోహన్, వీరమల్లు సూరిబాబు, కొయ్యలగడ్డ గణపతి, కొల్లాటి గోవింద్, కొల్లాటి నరసింహస్వామి, జల్లా వెంకటేశ్వరరావు, నసీమాబేగం, ఎండి.షబీనా, గంధం రాధ, మాదాసు కనకదుర్గ, నేదునూరి గంగాధర్, నల్లం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు చేరిన టీడీపీ దీక్షలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షులు చంద్రబాబును అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ పిలుపు మేరకు పోలవరం నియోజకవర్గ స్థాయిలో కొయ్యలగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్షలో నియోజకవర్గంలో ఉన్న 7 మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, దీక్షలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని సంఘీభావం తెలియజేశారు. చంద్రబాబుతో నేను సైతం అంటూ దీక్ష శిబిరం వద్ద ఏర్పాటుచేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీ పై పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు ప్రత్యేక సంతకాలు చేశారు. రామకృష్ణారావు మాట్లాడుతూ త్వరలోనే చంద్రబాబు కడిగిన ముత్యంలో జైలు నుండి విడుదల అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, జీలుగుమిల్లి మండల నాయకులు, కొయ్యలగూడెం మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక

విశాలాంధ్ర - గణపవరం: నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో గణపవరం బాయ్స్ హై స్కూల్ విద్యార్థులు అండర్ 17 విభాగంలో వాలీబాల్‌కు ప్రణయ్ కుమార్, జాషువా ఎంపికయ్యాడు. అండర్ 17 విభాగంలో నవీన్ చెస్‌కి ఎంపికయ్యాడు. అండర్ 14 విభాగంలో చెస్‌కి మహేష్ కుమార్, పోసి సాయిరాం ఎంపికయ్యారు. వీరందరూ జిల్లా స్థాయికి వెళతారని హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. పద్మావతి తెలిపారు.

ఎలుకల నిర్మూలనతో పంటల్లో అధిక దిగుబడులు

విశాలాంధ్ర-మండవల్లి: పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలంటే ఎలుకల నిర్మూలన సకాలంలో సామూహికంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడిఏ.జి.వెంకటమణి అన్నారు.ఎలుకల నిర్మూలనపై మండవల్లి ఆర్బికె నందు రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ ఆర్బికెల ద్వారా బ్రోమెడయోలిన్ మందును ఉచితంగా అందిస్తున్నామని మండవల్లి మండలానికి 25 కేజీల మందును ప్రభుత్వం సరఫరా చేసిందని మండలంలోని అన్ని ఆర్బికెల ద్వారా మందును రైతులకు అందిస్తామన్నారు. విషపు ఎర తయారికి 96 శాతం బియ్యపు నూకలు, రెండు శాతం నూనె, రెండు శాతం మందు అవసరమని మిశ్రమాన్ని తయారి చేసి పొట్లాలుగా చుట్టి ఎలుకల బొరియల్లో ఉంచి ఎలుకలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెండా సురేష్, వివిఎలు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,రైతాంగం పాల్గొన్నారు.

జి పి.ఎస్ బిల్లుపై నిరసన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జీపీఎస్ బిల్లుకు వ్యతిరేకంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిపిఎస్ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి సిపిఎస్ ఉద్యమ నాయకుడు ఆర్. నాగ దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చిన మాట మర్చిపోయి నేడు దుర్మార్గంగా జీపీఎస్ బిల్లు తీసుకువచ్చారన్నారు. ఉద్యోగులకు నష్టం చేకూర్చే విధంగా ఉన్న జీపీఎస్ విధానం వల్ల ప్రభుత్వానికే ఉపయోగం కానీ ఉద్యోగికి ఉపయోగం లేదన్నారు.బి.టి.ఏ మండల కార్యదర్శి కె.రాజా మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోరిక అయిన పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఏపిటిఎఫ్ నాయకులు కే. సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగికి వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన ప్రభుత్వం వాళ్ళ నోట్లో మట్టి కొట్టి వాళ్ళ దగ్గర డబ్బులు లాక్కొని వాళ్ళకే తిరిగి పెన్షన్ ఇస్తామని చెప్పడం దారుణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కే. రాజు ,వై.రాంబాబు, రామారావు, ధర్మరాజు, రమేష్, ఎన్. వీరభద్రరావు, సత్యనారాయణ,హరినాథ్, ఆచారి, పోశారావు, మోహన రాణి, అనూష,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర- పోడూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాత్రాపు సూర్యనారాయణ కోరారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి రైతాంగ శిక్షణా తరగతులు మండలం లోని కవిటంలో మేడపాటి పరశురామారెడ్డి కళ్యాణ మండపంలో గురువారం ప్రారంభమయ్యాయి. శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని గతంలో ఎన్నడూ లేనట్లుగా వర్షాభావంతో అధిక మండలాలు కరువు మండలాలుగా మారిపోయాయని అన్నారు. పంట ప్రారంభం లోనే పంట ఎండి పోయి రైతాంగం తీవ్రంగా నష్ట పోయారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. బ్యాంక్ రుణాలు రద్దు చేసి తదుపరి పంటకు రుణాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ని అనుసరించి పంటకు మద్దతు ధరను అమలు జరపాలన్నారు. స్వామి నాథన్ రిపోర్టు ప్రకారం మద్దతు ధర అమలు జరపాలని డిమాండ్ చేశారు.రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట చేతికి వస్తున్నదని ప్రభుత్వం గత రబీ సీజన్ లోని ఇబ్బందులను గమనించి ముందుగానే సంచులు,బరకాలు తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు.కౌలు రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు.కొబ్బరి రైతులకు ప్రభుత్వము మద్దతు ధర కల్పించి రైతులను నష్టాల నుండి ఆదుకోవాలని కోరారు. శిక్షణా తరగతుల కు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తుగ నరసింహ మూర్తి అధ్యక్షత వహించారు. చింతకాయల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: స్థానిక సి ఎస్ టి ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం గెస్ట్ లెక్చరర్ పోస్ట్ కు అర్హులైన వారి నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో పాస్ అయ్యి ఉండాలని దానికి అనుబంధంగా ఏపి సెట్ లేదా ఎంఫిల్,పీహెచ్ డి చేసి,బోధనానుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.అక్టోబర్ 5 వతేదీ లోపు కళాశాల కార్యాలయంలో సంప్రదించి బయో డేటాలను సమర్పించాలని,ఇంటర్వ్యూ తేదీని ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్ బాబు తెలిపారు.

న్యాయం కావాలంటూ నిరసన

విశాలాంధ్ర-ముసునూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టునకు నిరసనగా గురువారం మండల కేంద్రమైన ముసు నూరు మండపం సెంటర్ వద్ద న్యాయదేవత న్యాయ పక్షాన వుండి మా చంద్రబాబు నాయుడికి న్యాయం జరిగేలా మచ్చలేని చంద్రుడు వలే బయటకు రావాలని కోరుతూ టీడీపీ నేతలు నిరసన తెలిపారు. టిడిపి నాయకులు గద్దే రఘుబాబు, లక్కపాము కాంతారావు,రాపర్ల ప్రతాప్,గద్దల మోహనరావు, పర్వ తనేని వెంకటేశ్వరరావు, సుగసాని వేణు, ఏనుగుధాటి నాగరాజు, రంగు వాసు,పల్లిపాము జీవరత్నం,చలమాల వెంకటేశ్వరరావు, రెడ్డి కృష్ణ,నక్కా యోహాన్, తదితరులు న్యాయదేవతను వేడుకున్నారు.

మానవతా విలువలకు ప్రాధాన్యతనిచ్చిన జాషువా

విశాలాంధ్ర-ఏలూరు: గురువారం స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయం ఏలూరులో కవికోకిల, పద్మ విభూషణ, కళా ప్రపూర్ణ గుర్రం జాషువా 128 వ జయంతి సభ బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయిరాజు భల్లం అధ్యక్షతన జరి గింది. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, గాయకులు, పుర ప్రముఖులు పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలంకరణ చేయటమే కాకుండా, జాషువా తెలుగు భాష సాహిత్య రంగానికి చేసిన కృషి, సేవలను గురించి కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగావిచ్చేసిన జెడి, సోషల్ వెల్ఫేర్ శాఖ విజయ ప్రకాష్ మాట్లాడుతూ, లౌకిక విధానానికి మానవతా విలువలకు సాహిత్యంలో పెద్ద పీట వేశారన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన డా.లంకా వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ సమకాలీగిన కవుల కన్నా, ఆయన ఏ విధంగా అగ్ర గణ్యుడో వివరించారు.
ఏవిఆర్ విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సమాజంలో విప్లవాత్మక ఆలోచన విధానాన్ని తమ రచనల ద్వారాను సందర్భోచితంగానూ, వారి తెలుగు భాషను, తెలుగు సాహి త్యంను కొత్త పుంతల తొక్కించారన్నారు.మేతర అజయ్ బాబు వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమం బహుజన టీచర్స్ అసోసియేషన్, కరుణోదయ మానసిక విభిన్న ప్రతిభావంతుల పాఠశాల, బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ, ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : నవయుగ వైతాళికుడు, కుల వ్యతిరేకతను అణగద్రొక్కి సమాజంలో మార్పునకు నిరంతరం శ్రమించిన నవయుగ వైతాళికుడు, ప్రముఖ కవి గుర్రం జాషువ 128వ జయంతి గురువారం విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విశ్రాంతి ఉద్యోగుల జిల్లా జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ అభ్యుదయ కవితాతత్వాన్ని జీర్ణించుకుని ఆనాటి సమకాలిన పరిస్థితులను అనుగుణంగా రచనలు చేసి సమాజంలో ఉన్న అగ్ర కుల అహంకారాన్ని అణగద్రొక్కేందుకు కృషి చేశారని కొనియాడారు. పేదరికం, కులమత బేధం ఆయనకు సహనాన్ని నేర్పాయని, ఎదురించే శక్తి దారిద్ర్యాన్ని నుంచి విముక్తి పొందారని ఆయన అనాడే సమాజంలో ధైర్యంగా కవితల రూపంలో రచనలు చేశారన్నారు. గబ్బిలం, క్రీస్తు చరిత్ర లాంటి రచనలు వ్రాసి ప్రజల్లో మార్పునకు కృషి చేశారన్నారు. నవయుగ కవి చక్రవర్తిగా, కవి కోకిల, విశ్వ కవి సామ్రాట్ లాంటి పలు బిరుదులు ఆయన పొందారని తెలిపారు. నేటి యువత వాటిని ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగ సంఘ సభ్యులు పత్తి వీరాస్వామి, కోటి వీరారావు, ముస్తఫా, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఊరేగింపు

విశాలాంధ్ర - తాళ్లపూడి : అన్నదేవరపేటలో లక్ష్మి గణపతి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా గణపతిని ఊరేగించారు. ఈ సందర్భంగా బుట్ట బొమ్మలు, రాముడు , ఆంజినేయుడు రామాయణంలోని పలు వేషాలతో డీజే , తిన్ మార్ డప్పులు తో పిల్లలు , పెద్దలు ఉత్సాహంగా వినాయకుడు ఊరేగింపులో పాల్ గొన్నరు అనంతరం నిమజ్జనం జరిగింది. ఆదివారం నాడు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామని కమిటీ వారు తెలిపారు. భక్తులు పాల్గొన వలసిందిగా కోరారు.

అందరూ బాగుండాలని వినాయకునికి పూజలు

విశాలాంధ్ర - జగ్గంపేట : వినాయకచవితిని జగ్గంపేట నియోజకవర్గంలో అన్న సంతర్పణలు జరుగు తున్నాయి. జగ్గంపేట లారీ యూనియన్ అసోసి యేషన్ అధ్వర్యంలో భారీ అన్న సంతర్పణ చేశారు. జగ్గంపేట మండలం రామవరం వద్ద ఉన్న లారీ యూనియన్ కార్యాలయం వద్ద ప్రతి ఏడాదీ వినాయకచవితి వేడుకలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నారు. అదే విధంగా ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురష్కరించుకుని సమారు 5 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దవులూరి ఈశ్వరరావు మాట్లాడుతూ 1991 సంవత్సరంలో లారీ యునియన్ భవనం నిర్మించామన్నారు. అప్పటి నుంచి వినాయక చతుర్థి ను జరుపుకుంటూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారన్నారు. తమ యూనియన్ సభ్యులు అంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మారిశెట్టి రాధ మాట్లాడుతూ గత 4 సంవత్సరాల నుంచి సుమారు 6 నుంచి 7 వేల మంది జనాభా వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి భారీగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ వర్మ, సుబ్బరాజు, జీపు రాంబాబు, చక్రధర్, వై గంగాధర్, శివ, మారిశెట్టి రామకృష్ణ, శ్రీనివాస్, తదితర సభ్యులు పాల్గొని అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన కొత్తలంక వలిబాబా ఉరుసు మహోత్సవములు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : మమ్మిడివరం మండలంలోని కొత్తలంక హాజరత్ సయ్యద్ అహ్మద్ ఖాదర్ వలి బాబా ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాలలో భాగంగా బుధవారం గంధం పూయుట, గురువారం దీపారాధన, శుక్రవారం జియారత్ మూడు రోజులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. వలి బాబాను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చి దర్శించుకుంటారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ వారు తగిన ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ ఒడికి తరలివెళ్లిన వినాయకుడు



విశాలాంధ్ర - రాజానగరం : వినాయక చవితి వేడుకల్ని పురస్కరించుకుని నియో జకవర్గ కేంద్రమైన రాజానగరం లో గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. రాజానగరంలోని వివిధ కూడళ్లల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో 11 రోజుల పాటు పూజలందుకున్న లంబోదరుని శోభాయాత్ర గురువారం మధ్యాహ్నం నుండే మొదలైంది.నిమజ్జన కార్యక్రమాల్లో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరునికి ఘనంగా వీడ్కోలు పలికారు. చిన్నారు లు,యువకులు రంగులు అద్దుకొని డీజే పాటలకు డాన్సులు వేశారు.ఈ సందర్భంగా స్థానిక నరేంద్రపురం కూడలి వద్ద శ్రీ లక్ష్మీ గణపతి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుమారు18 అడుగుల భారీ వినాయక విగ్రహానికి మేళతాళాలు, డిజె సౌండ్స్ మధ్య కమిటీ సభ్యులు డాన్సులు చేస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని గోదావరిలో నిమజ్జనగావించారు. బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణనాథున్ని ఊరేగించి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఆయా కమిటీ సభ్యులు డాన్సులు చేస్తూ ఉల్లాసంగా నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా కమిటీ సభ్యులు పలు జాగ్రత్తలు తీసుకుంటూ ఊరేగింపుల్లో పాల్గొన్నారు.

తాడిపర్రులో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: వినాయక చవితి, గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని తాడిపర్రులో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. తాడిపర్రు కరికాలబత్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటుపల్లి శ్రీరామారావు, పీతా నాని, మోటుపల్లి ఆంజనేయులు, పీతా రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి సంస్థ ప్రారంభం

విశాలాంధ్ర-ఏలూరు: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అందుబాటు ధరల (సరసమైన) గృహ ఋణ (హౌసింగ్ ఫైనాన్స్) కంపెనీలలో ఒకటైన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, ఏలూరులో తమ మొదటి శాఖతో ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించింది. ఇది రాష్ట్రంలో సంస్థకు 9వ శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఈ విస్తరణ, రాష్ట్ర మంతటా వీలైనంత ఎక్కువ మందికి సరసమైన ధరల్లో గృహాలను అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ యొక్క దృఢమైన లక్ష్యం ను ప్రదర్శిస్తుందని ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీపక్ పాట్కర్ చెప్పారు. గతంలో ఫుల్లర్టన్ ఇండియా హోమ్ ఫైనాన్స్ కంపెనీగా గుర్తింపు పొందిన ఎస్ఎంఎఫ్ జీ గృహశక్తి, తమ విస్తృతమైన అనుభవం, బలమైన పేరెంటేజ్, దేశవ్యాప్తంగా డిస్ట్రిబ్యూషన్ మరియు బలమైన రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్ తో గృహ , గృహాభివృద్ధి , గృహ నిర్మాణం , గృహ విస్తరణ తో పాటుగా తనఖా రుణాలు మరియు మధ్య స్థాయి డెవలపర్‌లకు కొత్త లేదా పునఃవిక్రయం వాణిజ్య ఆస్తి, వాణిజ్య ప్లాట్లు మరియు నిర్మాణ ఫైనాన్స్ కోసం రుణాలు సహా విస్తృతమైన రుణాల పోర్ట్‌ఫోలియోను కలిగి వుందని తెలిపారు.

అక్టోబర్ 2 నుంచి జీ తెలుగు లో సీతే రాముడి కట్నం

విశాలాంధ్ర-రాజమండ్రి: అక్టోబర్ 2 వ తేదీ నుంచి జీ తెలుగు చానల్ లో సీతే రాముడి కట్నం అనే నూతన ధారావాహిక ప్రారంభించనున్నట్టు ఆ ఛానల్ ప్రతినిధి వెల్లడించారు. నిరాడంబరత, నిజాయితీగా జీవించే సీత అనే సాధారణ అమ్మాయి చుట్టూ ఈ సీరియల్ కథ తిరుగుతుందన్నారు. సీత ఫ్యాషన్ పై అభిరుచి కలిగి, మంచి నైపుణ్యంగ ల టైలర్ గా పనిచేస్తుందన్నారు. నిజాయితీపరుడైన రామ్ పోలీస్ కావాలని కలలు కంటూ తన తల్లి ఆదేశం మేరకు తమ కుటుంబపరమైన వ్యాపారాన్ని చూసుకుంటూ ఉంటాడన్నారు. మహాలక్ష్మి కి (రామ్ తల్లి) అందానికే ప్రాధాన్యతిస్తూ, అందమైన అమ్మాయిని ఇచ్చి కొడుక్కి పెళ్లి చేయాలని ఆశపడుతుందన్నారు. అందంగా లేని దేన్నైనా ద్వేషించే మహాలక్ష్మి తనకు ఎ నచ్చని సీతను కోడలుగా పొందుతుందన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 12:30 కు ప్రసారం కానుందన్నారు. సీరియల్లో సీతగా వైష్ణవి, రామ్ గా సమీర్ నటిస్తున్నారని, మహాలక్ష్మిగా మంజుల పరిటాల నటించగా, సీత తండ్రి శివకృష్ణ పాత్రలో ప్రముఖ నటుడు ఇంటూరి వాసు కనిపించనున్నారని,
సీతే రాముడి కట్నం సీరియల్ ప్రారంభంతో మిగతా సీరియల్స్ ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయని చెప్పారు.

వైభవంగా శ్రీ వినాయకుని నిమజ్జనం

విశాలాంధ్ర - ఐ పోలవరం : శ్రీ గణపతి చవితి నవరాత్రులు పరిసమాప్తి సందర్భంగా ఐ.పోలవరం మండలంలో వినాయక నిమజ్జనం అట్టహాసంగా జరుగుతున్నాయి. మురమళ్ళ పుష్కర ఘాట్‌లో పవిత్ర వృద్ధ గౌతమి నదిలో నిమజ్జనం చేశారు. ఐలాండ్ పరిసర ప్రాంతాలు ఉండే కాకుండా కోనసీమ జిల్లా ప్రాంతాల నుండి మురమళ్ళ ప్రాంతంలోకి నలుమూలం నుండి తీసుకువచ్చి ఎక్కడ పవిత్ర వృద్ధ గౌతమి నదిలో నిమజ్జనం చేశారు. మురమళ్ళ శ్రీ మాణిక్యమ్మ నగర్ నుండి వినాయక నిమజ్జనం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ మాణిక్యాంబ వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయకుల ఊరేగింపులతో మురమల 216 జాతీయ రహదారి స్తంభించిపోయింది. వినాయక చవితి నిమజ్జనం ఊరేగింపులతో మురమళ్ళ ప్రాంతం కళకళలాడింది.

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : ప్రపంచ రేబిస్ దినోత్సవ సందర్భంగా స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన గంజిమల రామారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెంచుకునే తమ పెంపుడు కుక్కలకు రెబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. పశువుల ఆసుపత్రి వద్ద ప్రతిరోజు వ్యాక్సిన్లు వేస్తారని నిర్లక్ష్యం చేయకుండా మూగజీవాల ఆరోగ్యం పట్ల కూడా కుక్కల పెంపకం దారులు, పశువుల పెంపకం దారులు శద్ధ చూపాలని ఆయన తెలిపారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయాలన్న, పశువులకు వివిధ శస్త్ర చికిత్సలు చేయాలన్నా పశు వైద్య అధికారిని సంప్రదించాలని రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పూలపల్లి రవికుమార్, పశు వైద్య అధికారి బిఆర్ శ్రీనివాసన్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలి

విశాలాంధ్ర - పిఠాపురం టౌన్ : పట్టణంలోని స్థానిక 13వ వార్డు శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం ఎదురుగా గల వీధిలోని "వివి గ్రాండ్" వద్ద ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని స్థానికులు, కౌన్సిలర్ తల్లిశెట్టి వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం ఎదురు వీధిలో వివి గ్రాండ్ అను పేరుతో రూములు అద్దెకిచ్చు బిల్డింగు ఉందని, సదరు బిల్డింగు వారు వారి బిల్డింగు అవసరార్థం కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ వేయించుకొనుటకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ట్రాన్సార్మర్ ఆ ప్రదేశంలో కాకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వేరే చోట ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వాటిలో సతీష్, కరణం వెంకటేష్, బాలెం కిరణ్, శ్రీను, ప్రసాద్, నల్లమిల్లి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

జాషువా కవితలు ఆదర్శప్రాయం

విశాలాంధ్ర - పెద్దాపురం : తెలుగు భాషా రచయిత, కవి గుర్రం జాషువా కవితలు అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ జాషువా పండితుడుగా, సాహితీవేత్తగా ఆయన అందించిన సేవలు వెలకట్ట లేనివన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి చైర్మన్ తులసి మంగ తాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్ కనకాల మహాలక్ష్మిలతో కలిసి దొరబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, గుర్రాల యాకోబు, పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు. దావీదు, తలారీ ధరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాదున్నబి వేడుకలు

విశాలాంధ్ర - పెద్దాపురం : ముస్లిం సోదరులు ఎంతో ప్రాముఖ్యంగా నిర్వహించుకునే మిలాదున్నబీ మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు గురువారం పెద్దాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కబడ్డీ వీధి-మసీద్ నుంచి పురవీధుల్లో ముస్లిం సోదరులు భారీ ప్రదర్శన నిర్వహించగా ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీమ్ (కానీ) ముఖ్య అతిథిలుగా పాల్గొని ముస్లీం సోదరుల ప్రదర్శనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రవక్త ఆశయాలకి అనుగుణంగా ఆయన బోధనానుసారం నడుచుకోవాలన్నారు. ముస్లిం సోదరులకు తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, దొరబాబు అన్నారు. తొలుత మసీద్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో కబడ్డీ వీది, మెయిన్ రోడ్డు, మున్సిపల్ సెంటర్ మీదుగా బారీ ప్రదర్శన నిర్వహించి మసీద్ వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.